శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## జిల్లాలో పలువురు ఎస్సైలు బదిలీ

**నెల్లూరు క్రైమ్, జనవరి 19, ప్రభాతవార్త** జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు స్వేషన్‌లో పని చేస్తున్న కే.ప్రసాద్ రెడ్డి ఏస్‌పేటకు, అక్కడ పని చేస్తున్న పి.నరేష్ కందుకూరు రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కందుకూరు రూరల్‌లో పని చేస్తున్న కే.తిరుపతయ్యను వరికుంటపాడుకు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న సుమన్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. నెల్లూరు రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న బి.లక్ష్మణరావు గూడూరు పట్టణ పోలీసు స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న కే.కిషోర్‌బాబు కందుకూరుకు, వీఆర్‌లో ఉన్న ఎం.సూర్యప్రకాష్‌రెడ్డి అనంతసాగరంకు, పి.విజయ్‌కుమార్ నెల్లూరు బాలాజీనగర్ స్టేషన్‌కు, ఏ.శ్రీనివాసరెడ్డి ముత్తుకూరుకు బదిలీ అయ్యారు. ముత్తుకూరులో పనిచేస్తున్న శివకృష్ణారెడ్డి స్పెషల్ బ్రాంచ్‌కు, కావలి రూరల్ పనిచేస్తున్న సుమన్ నవాబుపేట పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న మరీదునాయుడు దగదర్తికి, అక్కడ పనిచేస్తున్న విజయ్‌కుమార్ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

## ఉలవపాడులో గోవుల గుంపులతో అవస్థలు

**ఉలవపాడు, జనవరి19, ప్రభాతవార్త** ఉలవపాడు ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై ఎక్కడబడితే అక్కడ గోవుల గుంపులు నడిచే స్పీడ్ బ్రేకర్లలా ఉంటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ప్రతి రోజు ప్రధాన రహదారులపై గోవుల గుంపులుగా ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోవుల యజమానులకు నోటీసులు ఇవ్వడం ద్వారా వాటి సంచారాన్ని నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు

## యోగివేమనకి నివాళులు



**నెల్లూరు అర్బన్, జనవరి19, ప్రభాతవార్త** యోగివేమన జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఎం.హరినారాయణన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఓ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## 29 నుండి ప్రజాభిప్రాయ సేకరణ

**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2024-25 ఆర్థిక ఏడాదికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై ఈనెల 29 నుండి 31వరకు విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి విజయన్ వెల్లడించాడు. శుక్రవారం నగరంలోని విద్యుత్‌భవన్‌లో విజయన్ మాట్లాడుతూ ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 4గంటల 30నిమిషాలకు జరుగుతుందన్నారు. ఇందులో ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజలు పాల్గొని వారి సమస్యలను తెలియచేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన విఆర్ఒ



**అనుమసముద్రంపేట ,జనవరి 19, ప్రభాతవార్త :** జిల్లాలోని అనుమసముద్రంపేట మండల తహ సిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎసిబి అధి కారులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో మండలంలోని పెద్దబ్బీపురం విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న ఎం.హాజరత్తయ్య 20వేల రూపాయలను లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే పెద్దబ్బీపురం గ్రామానికి చెందిన మలిశెట్టి చంద్రభూషణరావ్ తల్లిదండ్రుల ద్వారా తనకు సంక్రమించిన రెండు ఎకరాల పొలాన్ని తన అన్నపేరుమీద నుండి తన పేరుకు మార్చుడానికి సంవత్సరాల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా విఆర్ఒ పట్టించుకొనక పోగా మార్పుకు 40వేలు లంచం అడగ్గా అంత స్తోమ త లేని రైతు ఎసిబిని ఆశ్రయించాడు. అందులో మొదటగా 20వేల రూపాయలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టేకొని అదుపులోకి తీసుకొని విచారణ విచారణ చేపట్టారు. ఈ దాడుల్లో ఎసిబి డియస్పీ జిఆర్ఆర్ మోహన్, సిఐలు విజయ్‌కుమార్, వీరాంజనేయరెడ్డి , జిఎల్ శ్రీనివాస్, కిరణ్‌కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

## 1.75కోట్ల నగదు సీజ్.. ఉదయగిరి వాసి అరెస్టు

**ఉదయగిరి, జనవరి19, ప్రభాతవార్త** ఉదయగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన పంద్యాల కృష్ణారెడ్డి తన కారులో తీసుకుని వెళ్తున్న 1కోటి 75లక్షల నగదును ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు చౌటపల్లి గ్రామానికి చెందిన పంద్యాల కృష్ణారెడ్డి గత 20సంవత్సరాల క్రితం కర్నాటకలోని బల్లారిలో కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ అప్పుడప్పుడూ తన స్వగ్రామమైన ఉదయగిరి మండలం చౌటపల్లికి వస్తూ ఉండేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే నగదును తరలిస్తుండగా అనంతపురం జిల్లా విడపనకల్లు సమీపంలో పోలీసులు తనిఖీ చేశారని, ఆ తనిఖీల్లో నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని, ఈ విషయంపై విచారించిన పోలీసులకు ఇంటిస్థాలం కొనుగోలుకు నగదును తీసుకుని వెళ్తున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారని అన్నారు. పొంతనలేని సమాధానాలతో అతనిని అదుపులోకి తీసుకుని నగదును ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు సరండర్ చేసినట్లు అనంతపురం జిల్లా పోలీసులు, ఉదయగిరి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు.

## పర్యవేక్షణ లోపంతో కుంటుబడుతున్న కులగణన కార్యక్రమం

**ఉదయగిరి, జనవరి19, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలో అధికారులు నిర్వహించిన కులగణన సర్వే సాంకేతిక లోపంతో బయోమెట్రిక్ మిషన్లు లేక మధ్యలోనే ఆగిపోయింది. పలు గ్రామాల్లో విఆర్వోలు, వాలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి కులగణన కార్యక్రమం నిర్వహించడానికి ప్రయత్నించగా సాంకేతిక లోపాలు తలెత్తి వెబ్‌సైట్ పనిచేయలేదని తెలిపారు. అలాగే వాలంటీర్ల వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్లను మరమ్మత్తుల నిమిత్తం మండల అధికారులకు ఇవ్వగా తిరిగి వాటిని ఇవ్వడం కానీ, వాటి స్థానంలో కొత్తవి ఇవ్వడం కానీ ఇప్పటివరకు జరగలేదని తెలిపారు. సరైన సాధనాలు, సాంకేతికత లేకుండా పనులు ఎలా చేయాలని కిందిస్థాయి సిబ్బంది వాపోతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం అధికారుల అలసత్వంతో ఆదిలోనే కుటుపడింది. పైస్థాయి అధికారులు పర్యవేక్షణ, సరైన సూచనలు, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకపోవడం వలనే కార్యక్రమం నిర్వహించలేకపోయారని ప్రజలు వాపోతున్నారు. సమావేశాలు, మండలస్థాయి అధికారులు చేపట్టినా అందుకు తగ్గ సాధనాలు అందించడంలో సిబ్బంది విఫలమైయ్యారని ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం నవ్వులపాలైయ్యే విధంగా మారిందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, వాంలటీర్లు జ్యోతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశపరీక్ష 20న

**మర్రిపాడు, జనవరి19, ప్రభాతవార్త:** జవహర్‌నవోదయ విద్యాలయ ప్రవేశ పరిక్ష 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి పరిక్ష శనివారం జరుగుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్స్‌పాల్ ఎస్.శ్రీనివాసరావ్ తెలిపారు. 6వ తరగతిలో 80సీట్లు ఉండగా జిల్లా నుండి 4635 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకానున్నారన్నారు. ఈప్రవేశ పరిక్ష 21 కేంద్రాల్లో ఉదయం 11-30నుండి 1-30గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రవేశ పరిక్ష హాల్ టిక్కెట్లను నవోదయ వెబ్‌సైట్ డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు . నవోదయ.ఎన్ఐసి.ఇన్‌లో పొందవచ్చున్నారు. పరిక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్ , ఏదైనా గుర్తింపు కార్డు తమ వెంట తీసుకు రావాలన్నారు. పరిక్షాకేంద్రానికి గంటముందే రావాలన్నారు. హెల్ప్‌లైన్ 8985 007588, 8106898817,9493514644 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయం

**వెంకటాచలం జనవరి 19 ప్రభాతవార్త** రాష్ట్రంలో మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలో శుక్రవారం మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు లబ్దిదారులకు మంత్రి కాకాణి అందజేశారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లడుతూ రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టిన మహిళ పేర్లతో అమ్మఒడి, చేయూత, ఇళ్ల స్థలాలు పక్కా గృహాలు అన్ని మహిళ పేర్లతో ప్రవేశపెట్టిడం జరిగిందన్నారు. మహిళలను అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పిస్తూ, అన్ని రంగాల్లో ముందుకు తీసుకోని వెళ్లడం జరుగుతుందన్నారు. సర్వేపల్లి



నియోజకవర్గంలోని అర్హత కల్గిన ప్రతి మహిళలకు ఉచిత గ్యాస్ ఇప్పించే భాద్యతనాదిని మంత్రి భరోసా ఇచ్చారు. కోన్ని సాంకేతిక కారణాలు వలన ఆన్‌లైన్‌లో గ్యాస్ నమోదుకు పేర్లు నమోదు కాలేదని త్వరితగతిని సాంకేతిక కారణాలను సరళించి అందరికి గ్యాస్ కనెక్షన్లు మంజూరు చర్యలు చేపట్టాతామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే పూర్తి స్థాయిలో మహిళల పేర్లతో పక్కా గృహలు నిర్మించి పూర్తి చేశామన్నారు. ఈకార్యక్రమలో ఉప ఎంపిపి కనుపూరు కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్ నాయదు, జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, గ్యాస్ ఎజెన్సీ ప్రతినిదులు పాల్గోన్నారు.

# జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమీక్ష

**నెల్లూరు అర్బన్, జనవరి19, ప్రభాతవార్త** ఈ నెల 22వ తేదీ తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేసి, అదే రోజున గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తుది ఓటర్ల జాబితా వారికి అందజేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకే మీనా జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం రాష్ట్రం సచివాలయం నుండి కలెక్టర్లతో ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలింగ్ కేంద్రాలలో మౌళిక సదుపాయాల కల్పనపై తీసుకున్న చర్యలు, పోలింగ్ సిబ్బంది డేటా బేస్, ఈసీఐ నిబంధనల ప్రకారం బదిలీలు, జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ, ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ తదితర అంశాలపై మీనా కలెక్టరలతో సమీక్ష చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్,




డిఆర్ఓ లవన్న పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంకే మీనా జిల్లా కలెక్టర్లతో మాట్లాడుతూ 22వ తేదీ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి తుది ఓటర్ల జాబితా హార్ట్‌కాపీతో పాటు సిడి రూపంలో అందజేయాలన్నారు. పార్టీల నుండి, వ్యక్తుల నుండి మీడియాలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఈ సమావేశంలో వారికి వివరించాలన్నారు. జీరో, ఒకే డోర్ నెంబర్‌తో పదిఓటర్లకు పైగా ఉండే ఏ విధంగా సరిచేశారో వివరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న పాఠశాలలు కార్యాలయాల్లో మౌళిక సదుపాయాలు లేని చోట త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, రాంపుల సౌకర్యం ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించాలి....**

ఈ నెల 25వ తేదీన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో, మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల పరిధిలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించి ఓటర్ల ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. అలాగే కళాశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించి యువతచే ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ ఏఎస్ రాజు, ఎన్ఐసి అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి

**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైందని, దీనికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి అన్నారు. కోవూరు సచివాలయం-1 పరిధిలో పలు ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగి, వలంటీర్లు చేపడుతున్న కులగణన సర్వేను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కులగణన సర్వే వలన ఆ కుటుంబం యొక్క ఆర్థిక స్థితిగతులను పూర్తిగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఈ సర్వే వివరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలో చేర్చే విధంగా చర్యలు



తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కులగణన సర్వేకు కుటుంబంలోని వారు ఎటువంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గతంలో బీహార్ రాష్ట్రంలో మాత్రమే ఈ కులగణన సర్వే జరిగిందని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఈ సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేపై ప్రజలు ఎటువంటి అపోహాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. దీని వలన వారికి ఎన్నో ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు.

వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాల వివరాలను పారదర్శకంగా సర్వేలో పొందు పరిచేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఎంపీడీవో శ్రీహరి, ఏపీఎం వెంకటస్వామి, సీసీ సౌరీలు ఉన్నారు.

# బారా షహీద్ దర్గాను సందర్శనీయంగా తీర్చిదిద్దండి

**నెల్లూరు కార్పొరేషన్, జనవరి19, ప్రభాతవార్త** ప్రతిష్టాత్మకమైన నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించి, స్వర్ణాల చెరువె ఘాట్‌ను ఆహ్లాదకరమైన ఏర్పాట్లతో నగర ప్రజలకు సందర్శనీయంగా తీర్చిదిద్దాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ఇతర నాయకులతో కలిసి బారా షహీద్ దర్గాను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన మిచౌన్ తుఫాన్ నేపథ్యంలో దర్గా ప్రాంగణం మొత్తం అపరిశుభ్రంగా మారిందని, పచ్చదనం దెబ్బతిందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహన పనులను చేపట్టి స్వర్ణాల చెరువులో గుర్రపు డెక్కాకును తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కుల మతాలకు అతీతంగా దర్గాను సందర్శించే భక్తులకు అన్ని సౌకర్యాలతో పాటు ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూసుకోవాలని మేయర్ సూచించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అన్ని అభివృద్ధి పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని



అధికారులను మేయర్ ఆదేశించారు.

రూరల్ నియోజకవర్గ ప్రజలకు విశేషంగా సేవలు అందిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై పవిత్రమైన భారా షహీదుల ఆశీర్వాదాలు సదా ఉండాలని మేయర్ ప్రార్థించారు.

# మాజీ మంత్రికి ప్రోటోకాల్ వర్తించదు

**పొదలకూరు జనవరి 19 ప్రభాతవార్త** మాజీ మంత్రులకు ప్రోటాకల్‌ని కల్పించే విధానం రాజ్యాంగంలో లేదని ఈ విషయం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తెలియకపోవడం అవగాహన లోపమని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతు విషయ పరిజ్ఞానం, ఆలోచన అవగాహన, లేని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గత నాలుగురోజుల క్రితం పొదలకూరులోని తహసిల్దారు కార్యాలయంలో హడావుడి హంగామా చేశాడని నేను మాజీ మంత్రిని నాకు ప్రోటోకాల్ మీరు పాటించవద్దా అంటు తహసిల్దారుపై రెచ్చిపోయడాని అందుకు తగిన రీతిలో అధికారులు బేష్‌గా సమాధానం ఇచ్చారని



కాకాణి అన్నారు. మాజీ మంత్రులకు ప్రోటోకాల్ వర్తించే విషయం రాజ్యాంగంలో ఉంటే ఏ పేజిలో ఉందో తనకు చెప్పాలని కాకాణి సోమిరెడ్డిని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికి పట్టాలు పంపిణి చేశామన్నారు. సోమిరెడ్డి తాను మంత్రిగా ఉన్న సమయంలో రైతులకు భూములు ఇవ్వలేకపోయాననే కడుపు మంటతో బాధపడుతున్నాడని పేర్కున్నారు. నేడు కాకాణి వేల ఏకరాలు నియోజకవర్గంలో పంపిణి చేస్తుంటే జీర్ణించుకోలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన విమర్శించారు. మొత్తానికి రైతులకు పట్టాలు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి చాష్టలు చేస్తున్నాడని ఆయన వ్యవహారిశైలిపై కాకాణి మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన భూ పంపిణి వివరాలపై తికమకలు పడుతున్నాడని ఆర్‌టిఐ యాక్టర్ ద్వారా పంపిణికి సంబందించిన వివరాల ప్రతులను విలేఖర్లకు చూపించి విలేఖర్లకు ఆ కాపీలు అందజేశారు. నియోజకవర్గంలోని ఏ మండలంలో ఏ గ్రామంలో ఎన్ని ఎకరాలు ఏఏ రైతులకు పట్టాలు పంపిణి చేశామో ఇందులో పూర్తి స్థాయిలో ఉందని అందరు తెలుసుకోవచ్చునని ఆయన వివరించారు. ఇంకా మరిన్ని ఏకరాలు అర్హులైన వారికి అప్పజెప్పేందుకు సిద్దంగా ఉన్నామని ఆయన చెప్పారు. విషయ పరిజ్ఞానాం లేని సోమిరెడ్డి మాట్లాడుతుంటే ప్రభుత్వ అధికారులు సైతం అవాక్కు అవుతున్నారని తనకు ప్రోటోకాల్ ఉందనే భ్రమతో అధికారులను నిలదీస్తున్నారని ప్రోటోకాల్ ఉండదని మాజీ మంత్రులకు గుర్తు పెట్టుకోవాలని వ్యవహార శైలినిబట్టి గౌరవం ,మర్యాద, మాత్రం లభిస్తాయని ఈ మాత్రం గుర్తు ఎరగలేకపోవడం శోచనీయమని ఆయన సోమిరెడ్డికి తీరుపై ధ్వజమెత్తారు. మండల ప్రజాప్రతినిధులు, వైకాపానాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అంబేద్కర్ స్మృతివనం ప్రారంభిస్తే బాగుండేది



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** విజయవాడలో స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనం రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించి వుంటే బాగుండేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. శుక్రవారం కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో దళితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్.మల్లి మాట్లాడారు. విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడం పట్ల జగన్మోహన్‌రెడ్డి మరో అంబేద్కర్ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పడం దగాకోరుకు నిదర్శనమన్నారు. దళిత, గిరిజనులకు వ్యతిరేకంగా హత్యలు చేసిన వారిని, ఎమ్మెల్సీ అనంతబాబు లాంటి వారిని జగన్‌రెడ్డి ఖండించపోవడం దారుణమన్నారు. సుబ్రమణ్యం అనే డ్రైవర్‌ని హత్య చేసి డోర్ డెలివరీ ఇచ్చిన అనంతబాబు లాంటి వారిని ఖండించకపోగా నవ్వుకోవడం దళిత, గిరిజనులను అవమానపర్చడమేనన్నారు. డాక్టర్ సుధాకర్‌ను, చీరాల కిరణ్‌కుమార్‌ను, అనేక మంది దళితులను హత్య చేసిన విషయంలో జగనన్న ఏ రోజు ఖండించకపోవడం దారుణమన్నారు. హత్య చేసిన వారిని చేరదీసి ప్రశంసించే వ్యక్తి జగన్ అన్నారు. ఇలా దళితుల మీదే ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని ప్రయోగించారన్నారు. 916 మందిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. 27 సంక్షేమ పథకాలు తీసివేశారన్నారు. ఒక్క రుణం కూడా బ్యాంక్ నుంచి ఇప్పించలేదన్నారు. సంక్షేమ హాస్టల్స్‌ను తీసివేయడం తప్ప ఒక్కటి కూడా నిర్మించలేదన్నారు. ఆరు నెలల నుండి ఇప్పటి వరకు డైట్ బిల్లులు ఇవ్వలేదన్నారు. ఇంతగా దళిత, గిరిజనులకు వ్యతిరేకంగా చేసిన వ్యక్తి రాజ్యాంగ పదవిలో వుండటం అవమానకరమన్నారు. స్మృతి వనంను జగనన్న ప్రారంభించడం వల్ల అంబేద్కర్‌కు అవమానమైందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించి వుంటే బాగుండేదన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మీనర్సు, గిరిజన నాయకులు చౌటూరి విజయరత్నం, కత్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలంటూ అబద్దాలు చెబుతున్న ముఖ్యమంత్రి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరి ంచకుండా అంబేద్కర్ ఆశయాలంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని అంగన్వాడీ టీచర్లు, నాయకులు దుయ్యబట్టారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. కావలి ఏరియా వైద్యశాలకు ఎదురుగా జాతీయ రహదారిపై వున్న అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సిఐటియు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ నాయకులు బి.రఘురామమ్మ, ఇ.రమాదేవిలు మాట్లాడారు. సిఐటియు ఆధ్వర్యంలో 39 రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. డిమాండ్లను పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అయినా ఈ ముఖ్యమంత్రి మొండి వైఖరిని అవలంభించారన్నారు. అంబేద్కర్ మహిళల్ని రోడ్లెక్కి పోరాటాలు చేసేటట్లు ప్రభుత్వాలను పరిపాలించమని చెప్పాడా అని వారు నిలదీశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని అంబేద్కర్ చెప్పారన్నారు. అంతేకాకుండా క్రింద స్థాయిలో నివసించే పేద ప్రజలను సమాన స్థాయికి తీసుకురావాలని అంబేద్కర్ చెప్పారన్నారు. ఇలా నిరంకుశంగా పరిపాలించమని అంబేద్కర్ చెప్పలేదన్నారు. మన ముఖ్యమంత్రి అంబేద్కర్ ఆశయాలంటూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. మా సమస్యలు ఈ ముఖ్యమంత్రికి కనపడలేదా అని ప్రశ్నించారు. ఆయన చెప్పిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ముఖ్యమంత్రి మా సమస్యలు పరిష్కరించేటట్లు చూడయ్యా అని అంబేద్కర్‌ని కోరామన్నారు. మా డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, సిపియం నాయకులు జి.మధుసూదన్‌రావు, టి.తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.మాల్యాద్రి, యుటిఎఫ్ నాయకులు బి.శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగుల బకాయిల్ని వెంటనే చెల్లించాలి

**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఈ రాష్ట్ర ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయిలు బకాయి పడిందని వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ, ఉద్యోగులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి జాతీయ రహదారిపై ఉపాధ్యాయులు కదంతొక్కుతూ ధర్నాతో కూడిన ప్రదర్శన నిర్వహించారు. కావలి ఆర్డీవో కార్యాలయం నుంచి ఐదులాంతర్ల సెంటర్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు బి.శ్రీదేవి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.మాధవరావులు మాట్లాడారు. ప్రతి నెల 1వ తేదిన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, డిఎ, పిఎఫ్, రుణాలు ఎపిజిఐ తదితరాల రూపంలో 18 వేల కోట్ల రూపాయలు బకాయిలు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది తగదన్నారు. విద్యార్థుల్ని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు బకాయిలు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకండా నిరసన నినాదాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పి.మాధవ, కావలి యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె.ముజీబ్ అహ్మద్, జి.వేణుగోపాల్, జెవివి నేతలు కృష్ణారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ ఆడిట్ కమిటీ జిల్లా సభ్యులు దుర్గాప్రసాద్, జిల్లా ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఐ.హెచ్.ఎల్.ప్రసాద్, జలదంకి, కొండాపురం, బోగోలు, లింగసముద్రం, గుడ్లూరు యుటిఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణకు తరలివెళ్లిన దళిత సంఘాలు

**ఉదయగిరి,జనవరి19,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో డి.ఈశ్వరమ్మ వైసీపీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప బస్సు యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైధానంలో ఏర్పాటు చేసిన 125అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే సందర్భంగా గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న వారికోసం బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా తరలివచ్చిన అశేష ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయగిరి మండల పరిసర గ్రామాల నుండి తరలివచ్చిన వారందరినీ తీసుకుని వెళ్లడానికి ప్రభుత్వం ఉచిత బస్సును ఏర్పాటు చేసిందని, ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత తిరిగి వారి స్వస్థలాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిటిఎనాయకులు జ్యోతి శ్రీనివాసులు, ఎమ్ఈవో తోట శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగి అశోక్‌కుమార్, ఈవోపిఆర్డి మల్లికార్జున, గురవయ్య ,దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన పారదర్శకంగా నిర్వహించాలి



**వింజమూరు,జనవరి19,ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలో శుక్రవారం నుండి ప్రారంభమైన కుల గణనను పారదర్శకంగా నిర్వహించాలని సర్పంచ్ నల్లగొండ్ల సృజన పేర్కొన్నారు. వింజమూరు పంచాయతీ పరిధిలోని 1,2 సచివాలయాల పరిధిలో జరుగుతున్న కుల గణన కార్యక్రమాన్ని సర్పంచ్ నల్లగొండ్ల సృజన పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతోప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన ను చేపట్టారన్నారు. దీనివలన ఇంటింటి సర్వే ద్వారా కులాల వారీగా వివరాలు , కుటుంబంలో ఎంతమంది ఉంటుంది ఖచ్చితమైన సమాచారం వస్తుందనా న్నరు. బయోమెట్రిక్ ద్వారా కుటుంబ పెద్ద ధృవీకరణ తీసుకుంటారన్నారు. ఈసర్వే ఈనెల 28వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. సర్వేలో వ్యక్తులు వెల్లడించిన వివరాలను సచివాలయ సిబ్బంది నమోదు చేస్తారని ఎలాంటి ఆధారాలు అడగరన్నారు. ఈ సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. వీటితోపాటు నోకాస్ట్ కాటగిరి కూడా సేకరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కార్యదర్శి నాగిరెడ్డి , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## భావితరాల భవిష్యత్‌కోసం ప్రధాని కృషి



**ఆత్మకూరు,జనవరి19,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం కమీష నర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెపి సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లిఖార్జునరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం నరేంద్ర మోడి పేద ప్రజల అభ్యున్నతి కోసం నరేంద్రమోడి తొమ్మిదిన్నర సంవత ్సరంలో కే ంద్ర ప్రభుత్వం చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలనే ఉద్దేశంతో వికసిత భారత్‌సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి , ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కానీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులని , పేదల కష్టం చూస్తున్న మన ప్రధానమంత్రి నరేంద్రమోడి పేదల కోసం ఇల్లుకట్టారన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రా కదిలిరా చంద్రబాబు సభకు హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



**రాపూరు, జనవరి 19, ప్రభాతవార్త :** వెంకటగిరి నియోజకవర్గంలో రా కదిలిరా ఫ్రోగ్రాం చంద్రబాబు నాయుడు మీటింగ్‌కి హాజరైన క్లష్టర్-4 నువ్వుల శివరామకృష్ణ ఆధ్వర్యంలో కంబాలపల్లి పంచాయతీ నందు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తమ్ముళ్ల మహిళలు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. శుక్రవారం జరిగిన ఈ సభకు హాజరైన ప్రతి ఒక్కరికి రాపూరు మండలం లంబాలపల్లి గ్రామ పంచాయతీ తెలుగుదేశంపార్టీ బక్క శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణలో అంగన్వాడీల వేతనాల పెంపుదలపై ప్రకటన చేయాలి




**ఉలవపాడు,జనవరి19,ప్రభాతవార్త :** రాజ్యాంగ నిర్మాత అణగారినవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీల వేతనాల పెంపుదల చేస్తున్నట్లు ప్రకటన చేయాలని కోరుతూ ఉలవపాడు మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఉలపవాడు ప్రాజెక్టు ఆఫీస్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షులు ఇందిరావతిఅంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడారు. గత 39రోజులుగా అంగన్వాడీలు తన న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొండిగా, నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమ్మెచేస్తున్న అంగన్వాడీల మెజార్టీ దళితులు, గిరిజనులు అణగారిన వర్గాలకు చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కేంద్రంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం శుభపరిణామమని, అయితే అంబేద్కర్ పేరు చెప్పి అణగారిన వర్గాలకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. ప్రస్తుత వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదని, వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు లింగసముద్రం, గుడ్లూరు మండల అధ్యక్షులు బి.మార్తమ్మ, ఎస్,కె పద్మజ, సిఐటియు నాయకులు కత్తి బుజ్జమ్మ, కృష్ణమూర్తి, శైలజ, వివిధ సెక్టార్ లీడర్లు, ఆదిలక్ష్మి ,తిరుపతమ్మ, పద్మజ ,శ్రావణి ,ప్రశాంతి ,వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

**ఉలవపాడు,జనవరి19,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలకు చేరువ కావడానికి ఇప్పటికే అనేక పథకాలు అందిస్తున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంరక్షణ కోసం ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అందులో భాగంగా ఉలవపాడు 1వ సచివాలయ పరిధిలో వడ్డిపాలెం జనరల్ స్కూల్ నందు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామని ఎంపిడివో విజయ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి శిబిరానికి సంబంధించి కంటి అద్దాలు 73మందికి వచ్చాయని, వారికి శుక్రవారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందుగా జగనన్న సురక్ష వైద్య శిభిరాన్ని ఎంపిడివో విజయప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓఆర్డి ఎల్.చెంచమ్మ, స్థానిక సర్పంచ్ మానికల నాగలక్ష్మి, ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమమే టీడీపీ ధ్యేయం



**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం :** రాష్ట్రంలో బీసీల సంక్షేమాన్ని కోరే ఏకైకపార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ నియోజకవర్గంలోని సౌత్‌మోపూరులో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నడిబొడ్డున బీసీభవన్ కావాలని ఆకాంక్షించిన వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డన్నారు. బీసీభవన్ కోసం కిందిస్థాయి అదికారి నుండి సీఎం వరకు అనేకసార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రూ.5కోట్ల 45లక్షలతో బీసీభవన్‌ని కొండాయపాలెం గేటువద్ద 2021లో శంకుస్థాపనచేసి, పనుల పారంభించి రూ.80లక్షలతో పనిచేస్తే, ఆ డబ్బులు కూడా నేడు రాని పరిస్థితి ఉందన్నారు. దీనినిబట్టే వైసీపీ ప్రభుత్వం బీసీలపై కపటప్రేమ అర్థంచేసుకోవచ్చున్నారు. 9ఏళ్ళుగా నిరంతరం ప్రజల్లో ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని గిరిధర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో పిఎల్ రావు, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, కొండూరు పోలిశెట్టి, ఉప్పు భాస్కర్, షేక్ సుభాన్, పముజుల ప్రదీప్, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, రాపూరు శేఖర్, రాపూరు చెంచమ్మ, సుధాకర్‌గౌడ్, శివయ్య, నరసయ్య,

# అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి



**వింజమూరు,జనవరి19,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పట్ల వ్యవహరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శారద పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు ఐసిడిఎస్ కార్యాలయం నుండి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ర్యాలీగా బంగ్లాసెంటర్ చేరుకున్నారు. బంగ్లాసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి తాను ప్రతిపక్ష నేతగా ఉన్నసమయంలో చేపట్టిన పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కరాష్ట్రంలో కంటే మన రాష్ట్రంలో అంగన్‌వాడీలకు వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా వారు నిర్లక్ష్యంగా ఉండడంతో సమ్మె అనివార్యమైందన్నారు. అంగన్‌వాడీలు 39రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ మొండివైఖరి వీడలేదన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చేస్తున్న సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మాచట్టం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల బాధను ఆవేదను అర్థం చేసుకోలేని ప్రభుత్వ పెద్దలు చులకనగా మాట్లాడడం సబబు కాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగామే తప్ప తాము గొంతెమ మ్రకోర్కెలను కోరలేదన్నారు. అంగన్‌వాడీలపై కవ్వింపుచర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. తమ హక్కుల సాధనకొరకు పోరాటమే శరణ్యమన్నారు. షోకాజ్‌నోటీసులకు తాము తలొగ్గేదే లేదని తేల్చి చెప్పారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చెంచలబాబు, ఎపిటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి , అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో బిజెపి పార్టీదే అధికారం

**ఉదయగిరి,జనవరి19,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయ గిరిలోని బిజెపి కార్యా లయంలో ఉదయగిరి నియోజకవర్గ బిజెపి నా యకులు ముడ మాల రమేష్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజ కవర్గంలో రాబోయే బిజెపి పార్టీ గ్రామస్థాయిసభలను ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తమ పథకాలుగా చెప్పు కుంటూ పబ్బం గడుపుతున్న వైసీపీ పార్టీ ప్రభుత్వం యొక్క నిజస్వ రూపాన్ని ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. ఎం.ఆర్.ఆర్ ఫౌండే షన్ నిర్వహించే కార్యక్రమాల్లో గ్రామాల్లోని మహిళలు, ఉపాధి కొరకు గ్రామస్థాయిలో టీమ్‌లను ఏర్పాటు చేసి వారికి అవసరమైన కుట్టు మిషన్లను అందిస్తామని, వారు ఆర్థికంగా నిలదొక్కుకునే వి ధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఎమ్. ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియో జకవర్గంలో పలుచోట్ల తాము నిర్వహిస్తున్న ఉచిత విద్యాబోధన క్లాసులను మరింతగా ఉపయోగి ంచుకో వాలని రాబోయే పరిక్షలకు అనుగుణంగా విద్యార్థులు కోరినట్లయితే ఆయా గ్రామాల్లో సెంట్రల్ పాయింట్ చూసిఅక్కడ కూడా విద్యాబోధన చేయ డానికి సిద్ధం గా ఉన్నామని తెలిపా రు.విద్యా వం తులైన యు వకులు రాజకీయాల్లోకి వచ్చినప్పుడే ప్రజలకు మంచిపాలన అందించగలమని ఆయన తెలి పారు. బిజెపి పార్టీని ప్రజలు ఆదరిం చాల ని,నరేంద్ర మోదీ నాయ కత్వా న్ని దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి పురందేశ్వరి బిజెపిపార్టీ బలోపేతం కావడానికి సాయశక్తుల కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు అభినందనీయం



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని వైఎస్ఆర్‌సిపి పార్టీ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ,టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యొక్క 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం అభినందనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో బుచ్చి మండలం వైసిపి అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి,కౌన్సిలర్లు షేక్ షకిలాబేగం, బిట్రగుంట ప్రమీలమ్మ, దామరమడుగు కన్వీనర్ వినోద్, వైసిపి మహిళా నాయకురాలు బట్టా ప్రవల్లిక, పాల్గొన్నారు.అలాగే బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో కూడా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కౌన్సిలర్ షేక్ .రహమత్‌భాషా ,రాచూరు సత్యనారాయణ కార్యలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ యువజన వారోత్సవాలు



బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త నారాయణపురం (దక్షణమిట్ట)లో జాతీయ యువజన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చివరిరోజు కావడంతో యువజన వారోత్సవాల అహగాహన ర్యాలీని డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతు ప్రపంచంలోని దేశాలలో భారతదేశంలో మాత్రమే ఉక్కునరాలు,ఇనుప కండరాలు కలిగిన యువత దేశ జనాభాలో 60 శాతం పైగా కలిగి ఉన్న దేశం మనదే కనుక యువకులు స్వామి వివేకానంద ను స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. యువత క్రీడలలో రాణించి దేశ రక్షణలో ముందుండాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా యువతకు క్రీడా సామాగ్రిని అందజేశారు.యువకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిన వైసిపి నేతలు



**బిట్రగుంట, జనవరి 19 ప్రభాతవార్త** విజయవాడలోని అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు శుక్రవారం బోగోలు మండలం నుండి ప్రత్యేక బస్సులలో వైసిపికి చెందిన ఎస్సీ,ఎస్టీ, బిసి నేతలు తరలివెళ్లారు. మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు యాదవ్ ఆద్వర్యంలో సీనియర్ పార్టీ నేతలు పఠ్రి అంకులయ్య, ఎంపిటిసి ఎ.కె.సుందర్‌రాజ్ తదితరులు వున్నారు.

## కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రజలకు అవగాహన



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ ఏరియాలోని డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన వికసిత్‌భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం నుండి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిరుపేదలకు ఇస్తున్నటువంటి పథకాల గురించి అధికారులు,బిజెపినాయకులు ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలను వికసిత్ భారత్ వాహనంలో ఉన్న ఎల్ఈడి స్క్రీన్ మీద పథాకల గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొన్నారు.కార్యక్రమాన్ని కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, బిజెపి కోవూరు నియోజకవర్గం ఇన్‌చార్జి ఇండ్ల వెంకటరాఘవేంద్రరావు, బిజెపి సీనియర్‌నాయకులు డాక్టర్ పి.రాఘవరెడ్డి, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యాక్షురాలు ఆలూరు నాగవేణి, జిల్లా మీడియా పాయింట్ ఇంచార్జి బాస్కర్‌గౌడ్, ఎస్‌సిమోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మాచవరం శ్రీనివాసులు, మండల ప్రధానకార్యదర్శి కనిసిరి శీనయ్య, మండల కార్యదర్శి కోనం శ్రీనివాసులు, బిజెవైఎం మండల అద్యక్షులు గోలి సురేంద్ర, బిజెవైఎం మండల ప్రధానకార్యదర్శి తానా మణికంఠ, ఓబిసి మోర్చ మండల ప్రధాన కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, అధికారులు,బిజెపినాయకులు పాల్గొన్నారు.

## కాపుల ఆడబడుచుగా కాపుల సంక్షేమానికి పాటుపడతా

**కావలి రూరల్, జనవరి 19 ప్రభాతవార్త** కాపుల ఆడబడుచుగా కాపుల సంక్షేమానికి పాటుపడుతూ వారి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సతీమణి పసుపులేటి సుగుణమ్మ తెలిపారు. కావలి రైల్వే రోడ్డులోని కారొనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో కాపు నేతలు, వంగవీటి రంగా విగ్రహ కమిటీ సభ్యులు కావలి పట్టణంలో ఏర్పాటు చేయనున్న కాపుల ఆరాధ్య దైవం స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా విగ్రహ ప్రతిష్టకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పసుపులేటి సుగుణమ్మ పాల్గొని మాట్లాడారు. వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని కావలి పట్టణ నడిబొడ్డులో ఏర్పాటు చేస్తుండటం చాలా సంతోషంగా వుందని తెలిపారు. రంగా విగ్రహ ప్రతిష్టకు తనవంతుగా 10 లక్షల రూపాయలు విరాళాన్ని ఆమె ప్రకటించారు.ఇంకా అవసరమైతే మరో 10 లక్షల రూపాయలు అందజేయడానికి సిద్ధంగా వున్నానని తెలిపారు. అంతేకాకుండా కాపు భవనానికి, కాపు కళ్యాణ మండపాల నిర్మాణాలకు కూడా సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. వంగవీటి మోహన్‌రంగా పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. సుగుణమ్మ భారీ విరాళం ప్రకటించడంతో ఆమెను కాపు నేతలు అభినందించారు. అనంతరం పసుపులేటి సుధాకర్, పసుపులేటి సుగుణమ్మలు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, కాపు నేతలు దామిశెట్టి పూర్ణచంద్రరావు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, తోట వెంకటేశ్వర్లు, బండారు మహేష్‌నాయుడు, శానం కృష్ణ, నున్నా మురళి, కాపు నేతలు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రానికి ఫ్యాన్లు, బియ్యం వితరణ

**బిట్రగుంట, జనవరి 19 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి కావలి మండలం సిరిపురంకు చెందిన ముక్కు కొండమ్మ, సుబ్బులయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు, కుమార్తెలు సుబ్రమణ్యం, తిరుమల, రమణమ్మ, కనకమ్మ, సుధారాణి, అనూరాధలు నాలుగు ఫ్యాన్లు,కూరగాయలు, బియ్యం వితరణగా ఇచ్చారు.ఈ సందర్భంగా దాత తిరుమల మాట్లాడుతూ తన తల్లిదండ్రులు పేర్ల మీద ఆదరణ కేంద్రానికి ఈ వస్తువులు వితరణ చేయడం సంతోషంగా వుందన్నారు. ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## భట్రాజు సాధికార సమితి కన్వీనర్‌గా తిరుపతిరాజు

నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం నగర నియోజకవర్గ భట్రాజు సాధికార సమితి కన్వీనర్‌గా మాచిరాజు తిరుపతిరాజుని నియమించినట్లు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపిద్దాం



**కావలి రూరల్, జనవరి 19 ప్రభాతవార్త** రానున్న ఎన్నికలలో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి యువకుడు పనిచేయాలని కావలి జనసేన పార్టీ నాయకులు సిద్దు తెలిపారు. కావలి రూరల్ మండలం శ్రీరాంపురం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు లక్ష్మణ్, రామకృష్ణ, జయరాం ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిద్దు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి అవినీతి, అరాచకాలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేక, యువతకు ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వలసలు పోతున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో మనకు భవిష్యత్ లేదన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల జనసేన పార్టీ నాయకులు సురేంద్ర,సాయి మధు, సుబ్బరాయుడు, హరి, రాంబాబు, సురేష్, రమేష్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## విజయవాడ వెళ్లిన అంబేద్కర్ యూత్



**మనుబోలు, జనవరి 19, ప్రభాతవార్త** విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభ కార్యక్రమానికి మనుబోలు అంబేద్కర్ నగర్ నుండి యూత్ వెళ్లివచ్చారు. ఈ సందర్భంగా పరిమళ శివరామకృష్ణ, కందిమళ్ల మల్లిఖార్జునల ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి కార్యక్రమాన్ని వీక్షించారు. బయల్దేరే ముందు వైకాపా మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి, నెట్‌క్యాప్ డైరక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ వీరిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో పరిమళ భుజగేంద్రరావు, బండ్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమతా సంకల్ప యాత్రకు బస్సులు



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** విజయవాడలో అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని, ఇందుకు కోవూరు నుంచి మూడు బస్సులు బయలుదేరాయని మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఎం. చిరంజీవి తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక జాతీయ రహదారిలోని వైఎస్సార్ విగ్రహం నుంచి విజయవాడకు వెళ్లే సమతా సంకల్ప యాత్ర బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా అంబేద్కర్ విగ్రహాన్ని 18 ఎకరాల విస్తీర్ణంలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. ఆ విగ్రహావిష్కరణకు తాము స్వచ్ఛందంగా బయలుదేరుతున్నామన్నారు. ఎంపీడీవో శ్రీహరి, ఇనమడుగు గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, నేతలు అంజన్‌రావు, కె. ప్రసాద్, జగన్, వెంకటేశ్వరరావు, జ్యోతి, తదితరులు ఉన్నారు.

## 39వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త** : కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా కమిటీ సభ్యులు విజయమ్మ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అక్క చెల్లెమ్మలు అన్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీ పోరాటాలను కించపరిచే విధంగా జీవోలు, షోకాజ్ నోటీలసులు ఇస్తూ భయపెడుతున్నారన్నారు. 39 రోజులుగా అంగన్‌వాడీల సమ్మె చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన ఉద్యమాన్ని అణచి వేయాలని రకరకాల ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తుందన్నారు. తమ న్యాయమైన జీతాల పెంపు డిమాండ్‌పై ప్రభుత్వం పరిష్కారం చూపకుండా పోరాటాలు ఆపాలని చర్యలు తీసుకుంటున్నారని, ఇందుకు తాము ప్రతిఘటించి తీరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శేషయ్య, అఫ్రోజ్, వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీ నేతలు శేషమ్మ, సుభాషిణి, తదితరులు ఉన్నారు.

## సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న క్రికెట్ పోటీలు

**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త** : కోవూరు మండలం కొత్తూరు గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రికెట్ క్రీడా పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. శుక్రవారం జరిగిన పోటీల్లో సచివాలయం కోవూరు -1, కోవూరు -2, పడుగుపాడు -2 సచివాలయం, పోతిరెడ్డిపాలెం-1 సచివాలయం సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ శనివారం ఈ నాలుగు జట్టుకు సెమీ ఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయని, గెలిచిన ఈ నాలుగు జట్లు శనివారం 9 గంటలలోపు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రహీమ్, ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, రమేష్‌బాబు, పీఈటీలు వెంకటసుబ్బమ్మ, అజయ్, జాన్సన్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## చంద్రబాబుని కలిసిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వెంకటగిరి నియోజకవర్గంలో రా కదలిరా రా తెలుగుదేశం పిలుస్తోంది భారీ బహిరంగ సభ కార్యక్రమానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కలిసి పూలగుచ్ఛం అందించాడు.

## కావలి బృందావనంలో అయోధ్య రామలల్లా ప్రాణప్రతిష్ట ప్రత్యేక సంచిక పంపిణీ

**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** అ యోధ్య రామలల్లా ప్రాణ ప్రతిష్ట జా గృతి ప్రత్యేక సంచిక శుక్రవారం కావలి బృందావనం హౌసింగ్ కాలనీలోని ప్రతి ఇంటికి అందజేశారు. ఈ కార్య క్రమంలో కాలనీ వ్యవస్థాపక అధ్య క్షులు, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఆర్ఎస్ఎస్ నెల్లూరు జిల్లా విభాగ్ కార్యవహ చల్లా బాబు, జిల్లా సహకార్యవహ టంగుటూరి బాలము రళి, నగర ప్రచార ప్రముఖ్ మొగళ్లపల్లి రాజా, నగర కుటుంబ ప్రభోదన్ ప్రముఖ్ తాటికొండ ఉమా మహేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ కావలి నగర అధ్యక్షులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు, జిల్లా సహ కార్యదర్శి కోట సురేంద్రరెడ్డి, పర్యావరణ పరిరక్షణ సమితి ప్రముఖ్ గునుపూడి సుధీర్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. అయోధ్య రామలల్లా ప్రాణ ప్రతిష్ట ప్రత్యేకతపై అవగాహన కల్పించారు.

## అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే వ్యక్తి నారాయణ



**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే గుణమున్న వ్యక్తి నారాయణ అని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ కూమార్తె డాక్టర్ పొంగూరు సింధూర కొనియాడారు. శుక్రవారం నగరంలోని 44వ డివిజను పోస్టాఫీసు సందులో సింధూర బాబుష్యూ రిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ డివిజనులోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలే నాకు గుర్తుచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2014-19వరకు టీడీపీ హయాంలోనే నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో నారాయణ గెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తంచేశారు. పిట్టి సత్య నాగేశ్వరరావు, మహేంద్రరెడ్డి అలియాస్ చిన్నబ్బయ్య, రవిచంద్రబాబు, దర్శి హరికృష్ణ, రమేష్, బూత్ కన్వీనర్ విజయ్, బిఎల్‌ఏ కృష్ణ, సురేంద్రబాబు, రమేష్‌నాయుడు, కోకు జ్యోతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పధకాలను ప్రజలకు చేరువ చేయాలి



**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** కేంద్ర ప్రభుత్వం ప్రజలకోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులదేనని, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నాడు. శుక్రవారం నగర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో నారాయణరెడ్డి నిర్వహించాడు. ఈ సందర్భంగా వాకాటి మాట్లాడుతూ కేంద్ర పథకాలను ప్రతి పేదవాడికి అందచేయాల్సినా అధికారులు, దానిని విస్మరించడం బాధాకరమన్నారు. కేంద్ర రైతులకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నా, ఆ పథకాలపై వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి తన ఫోటో వేసుకుని ఆ సంక్షేమ పథకాలను తాను అందిస్తున్నట్లు జగన్, ఆపార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పంట నష్ట సమయంలో రైతులకు తక్షణం సహాయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని, ఈమధ్య జరిగిన తుఫాను కారణంగా వరదలతో కేంద్రం రైతులకు అందించిన నష్టపరిహారాన్ని ఇప్పటివరకు రైతులకు ఈ వైసీపీ ప్రభుత్వం అందించకపోవడం దారుణమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి ధ్వజమెత్తాడు. రాష్ట్రంలో వైసీపీకి తొత్తులుగా అధికారులు పనిచేస్తున్నారని ఆయన మండిపడ్డాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, విజయ్, యశ్వంత్‌సింగ్, మండ్ల ఈశ్వరయ్య, పెంచలయ్య, కవిత, వికసిత భారత్ కన్వీనర్ ముక్కు రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్, కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పూన మల్లిఖార్జున, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పధకాలు అర్హులైనప్రతి ఒక్కరికి అందాలి



**కలువాయి జనవరి 19 ప్రభాతవార్త** కేంద్రంలో ప్రభుత్వం పేదల పట్ల నిష్పక్షపాతంగా పనిచేస్తు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఈపథకాలు అందేలా సంబందిత అధికారులు చొరవ తీసుకోవాలని వెంకటగిరి నియోజకవర్గ బిజెపి సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు పేర్కున్నారు. బి.వి ఎన్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు అదే విధంగా కెసిమనేనిపల్లి పంచాయితీలలో శుక్రవారం వికసిత్ బాంత్ సంకల్పయాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంలో నరేంద్రమోడీ జనధన్ యోజన కింద 50 కోట్ల మందికి జీరో అకౌంట్లు ప్రారంభించారని దాని ద్వారా ప్రపంచంలోనే అత్యధిక అకౌంట్లు ఎక్కువ డిపాజిట్లు గల దేశంగా మొదటి స్దానంలో బారత్ ఉందని ఎస్ఎస్ ఆర్‌నాయుడు తెలిపారు.బలహీన వర్గాల ప్రజలకు సబ్సిడితోపాటు బుణాలు అందిస్తు తద్వారా వారి అభివృద్దికి కేంద్రం తోడ్పడుతుందని ఆయన పేర్కున్నారు .కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన విశ్వకర్మయోజన కిసాన్ సమ్మన్‌యోజన,సుకన్య సమృద్ధియోజన, ఎన్నె పథకాల గురించి వాటి ప్రయోజనాల గురించి ఈకార్యక్రమంలో ప్రజలకు వివరించారు.ఈకార్యక్రమంలో ఉజ్వల పథకం కింద అర్హులైన వారికి హెచ్‌పి గ్యాస్ కనక్షన్లు అందజేసి నరేంద్రమోడీ క్యాలెండర్లు కేంద్ర ప్రభు త్వం 9 సంవత్సరాల సుపరిపాలన కరపత్రాలు పంపిణి చేశారు.ఈకార్యక్రమంలో పార్టీ మండలాద్యక్షులు జి .మల్లికార్జుననాయుడు,మాజీ మండలాద్యక్షులు,దండు పెంచలయ్య, సీనియర్‌నాయకులు చల్లా మల్లి కార్జునరెడ్డి, జిల్లా ఎస్‌సిమోర్చ కార్యదర్శి పగిడి పెంచలయ్య,ఓబిసి మండలాద్యక్షులు రామకృష్ణా, మండల ప్రధానకార్యదర్శి బ్రహ్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆడుదాం-ఆంధ్రా విజేతలు బిట్-4 సచివాలయం




**పొదలకూరు జనవరి 19 ప్రభాతవార్త** ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో క్రికెట్ విజేతలుగా బిట్-4 సచివాలయం పరిధి క్రీడాకారులు ఎంపికైయ్యారు. నెల రోజుల నుండి హోరాహోరిగా జరుగుతున్న క్రికెట్ పోటీలలో ఎట్టి కేలకు బిట్-4 సచివాలయం పరిధిలోని క్రీడాకారులు ఎంపికై మెడల్స్ సొంతం చేసుకున్నారు. ఉన్నతాధికారులచేత గౌరవప్రధమైన రివార్డు అందుకున్నారు. పట్టణంలోని రమణారెడ్డి స్టేడియంలో శుక్రవారం జరిగిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో అంతిమ విజయం బిట్-4 సచివాలయం పరిధి క్రీడాకారులకు దక్కింది ఈ టీం కెప్టెన్ ఎస్ .గణేష్ ఆద్వర్యంలో టీంలోని సభ్యులు టోర్నమెంట్ ప్రారంభం నుండి నెలరోజులు పాటు 23 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులతో పోటాపోటీగా తలపడి 5 మ్యాచ్‌లలో ఆడి విజయం సొంతం చేసుకుంటు క్రికెట్ కప్పును కైవశం చేసుకున్నారు.శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌ని తిలకించేందుకు రమణారెడ్డి స్టేడియానికి క్రికెట్ అభిమానులు స్దానికులు పోటేత్తెరు. పంచాయితీ పరిధిలోని తోకంచి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సిహెచ్ వెంకటేశ్వర్లు అలియాస్ లాంగ్ వెంకి క్రీడాకారులకు అండదండలుగా ఉండి ఆది నుండి వారిని ప్రోత్సహిస్తు విజయం సాదించేందుకు అహర్నిశలు కృషి చేశారని విజయం సాధించిన కెప్టెన్ ఎస్.గణేష్ పేర్కున్నారు. తొలుత మ్యాచ్ ప్రారంభంలో బ్యాటింగ్ ఎంచుకున్న గణేష్ టీం పది ఓవర్లలలో 3 వికెట్లు నష్టానికి 56 రన్నస్ దక్కించు కొని చాలెంజ్‌గా ప్రత్యర్ది టీంకి నెలబడ్డారు.అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బిట్-2 టీం పది ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 50 రన్నస్‌కే వెనుదిరగడంతో అంతిమ విజయం బిట్-4 క్రీడాకారులకు దక్కింది.ఆసక్తి కరంగా జరిగిన ఈ క్రికెట్ పోటీలు తిలకించిన పట్టణానికి చెందిన మండలాధికారులు మాట్లాడుతు ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈక్రికెట్ పోటీలు ఎంతో ఉత్కంఠ భరితంగా సాగాయని విజయం సాధించిన టీంను పేరుపేరున సత్కరించి జిల్లా స్దాయిలో వారు పోటీ పడేందుకు,పాల్గోనేందుకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామంటు భరోసా ఇచ్చారు.మెడల్స్ పొందిన క్రీడాకారులలో గణేష్‌టీం సభ్యులు వైఎస్ కెప్టెన్ మస్తాన్, క్రీడాకారులు మణి,నాగేంద్ర,పవన్,హరీష్,అఖిల్,సన్ని,హేమంత్,సుబ్రమణ్యం,శివాజీ, సురేష్, మహేష్,చందు, మహిని,నాగాని అభినందించి కెప్టెన్‌కి సహకరించినందుకు గణేష్ వీరికి ధన్యవాదాలు తెలిపారు.

## విజేతలకు బహుమతులు



**బిట్రగుంట, జనవరి 19 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని కుమ్మరి వీధిలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి పురుషులకు, మహిళలకు నిర్వహించిన చెడుగుడి పోటీల విజేతలకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీలో మొదటి బహుమతి కింద విడవలూరు టీముకు 20 వేలు, రెండవ బహుమతి కింద అల్లూరు టీముకు 15 వేల రూపాయలను ఆయన అందజేశారు. కన్సలేషన్ బెస్ట్ అఫెన్స్‌కి 5 వేల రూపాయలు ఎమ్మెల్యే అందజేశారు. యూత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు బోగిరి ప్రభాకర్, స్టాన్‌లీ, మేకల కిరణ్‌కుమార్, శ్యామ్ సుధాకర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు,మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, వైసిపి మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నేత తుమ్మల రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు



**మనుబోలు, జనవరి 19, ప్రభాతవార్త** ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని సర్వేపల్లి నియోజకవర్గ స్పెషల్ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సాయంత్రం ఆడుదాం ఆంధ్ర ముగింపు ఆటల పోటీల కార్యక్రమంలో బహుమతుల కార్యక్రమానికి విచ్చేసి ఆయన మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు తప్పక నిర్వహించాలని ఆయన కితాబునిచ్చారు. అలాగే మండల స్థాయి నాయకులు ఆడుదాం ఆంధ్రకు ప్రోత్సహించారని తెలిపారు. ఆడుదాం ఆంధ్రకు ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ మండలి అధ్యక్షులు జెట్టి సురేంద్రరెడ్డి, భారత్ పెట్రోల్ బంకు యాజమాన్యం, మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా మండల కన్వీనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసి యువకులకు ప్రోత్సాహనిచ్చారని కొనియాడారు. మండల స్థాయిలో గెలిచిన ప్రతి క్రీడాకారుడికి ఆయన అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్ కలివేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల పల్లెల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు పెట్టడం చాలా సంతోషమన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయికి వీరంతా ఎదగాలని ఆయన కోరారు. ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటల్లో ప్రోత్సహించి వారిని ఫిజికల్ ఫిట్నెస్‌కు ఎదిగేలా చూడాలని ఆయన కోరారు. చదువుతో పాటు ఆటలు చాలా అవసరమన్నారు. అలాగే హైస్కూల్‌పీఈటీ టీచర్లు లేరని, వాటిని భర్తీ చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా అక్కంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షటిల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూ.15లక్షల ఖర్చుతో వీటిని ఏర్పాటు చేసి క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌కు సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈనెల 31వ తేదీ అక్కంపేట ఉన్నత పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నెట్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ మాట్లాడారు. మనుబోలు సచివాలయం-2 క్రికెట్ టీమ్ ఆడుదాం ఆంధ్ర క్రికెట్ కప్‌ను కైవసం చేసుకుంది. వీరంపల్లి టీమ్ రన్నర్‌గా నిలిచింది. ఆడుదాం ఆంధ్రలో కబడ్డీ, క్రికెట్, ఖోఖో, షటిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు మండల ప్రజాపరిషత్ ఎంపీడీఓ ప్రసాద్, సూపరింటెండెంట్ రవికుమార్, కోఆప్షన్ మెంబరు ఎస్కే నాగూర్, మనుబోలు హైస్కూల్ పీడీ ప్రమీలరాణి,పీడీలు షరిత, కామాక్షి, బద్దవోలు హైస్కూల్ పీడీ మధుసూదన్‌రావు, మడమనూరు హైస్కూల్ పీడీ మురళీమోహన్‌లను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మండలి అధ్యక్షులు జెట్టి సురేంద్రరెడ్డి, వైకాపా మండల నాయకులు దువ్వూరు సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, అనిత, కృష్ణవేణి, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారం అందించాలి



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త** : పాడి రైతులు తమ పెయ్యి దూడలు సరైన సమయంలో ఎదకు రావాలంటే బలవర్ధకమైన మేత , పౌష్టికాహారం అందించేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో శుక్రవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయ్యదూడకు రెండు సంవత్సరాల వయస్సు ఉండాలని, బరువు 150 నుంచి 200 కేజీల వరకు ఉంటే ఎదకు వచ్చే సమయం ఆసన్నమవుతుందన్నారు. ఇందుకు గానూ మనరల్ మిర్చర్, దాణా, పౌష్టికాహారాన్ని సమపాళ్లలో అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఈ వయస్సులో ఎదకు రాకపోతే పోషణలో ఏయే లోపాలు ఉన్నాయి అనే విషయాన్ని సమీపంలో ఉన్న పశు వైద్యునితో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేలుజాతి పశు ఉత్పత్తిపై ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సజ్జాద్, రైతులు ఉన్నారు.

## శ్రీ పోలేరమ్మతల్లి పొంగళ్ల కార్యక్రమానికి హాజరైన ఇంటూరి



**ఉలవపాడు,జనవరి19,ప్రభాతవార్త** ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు శ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమానికి హాజరైన కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు,బెల్లం కృష్ణమోహన్,అమరనేని రాములు,మద్దసాని మహేంద్ర,బండి వెంకట సుబ్బయ్య,దేవినేని హనుమంతురావు,కొల్లి అవినాష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే చంద్రన్న ధ్యేయం



**వింజమూరు ,జనవరి19,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ని అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశంపార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావ్ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు లోని గంగమిట్ట ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గారంటీ ప్రజా దీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పాతూరులోని ఆంజేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నేతలతో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ - భవిషత్ గారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. గంగమిట్ట ముస్లింలతో మాట్లాడుతూ టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలకు తనపై ఉన్న ఆప్యాయత మరువలేనిదని వారితో ఉన్న అనుబంధం ఎనలేనిదన్నారు. రాష్ట్రంలో ఎటువైపు చూసినా అవినీతి జలగలు విజృంభిస్తున్నాయన్నారు. అవినీతి, సంక్షేమం మరుగున పడ్డాయన్నారు. తెలుగుజాతిని జాగృతం చేసేందుకు చంద్రబాబు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో వంచన చేస్తుందన్నారు.సంక్షేమమనేది తాము ప్రవేశపెట్టిన నవరత్నాలతోనే సాధ్యమని డాంభికాలు పలుకుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొనకపోతే మరో 20 ఏళ్ళు వెనుకపడాల్సి వస్తుందనా న్నరు. ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట దాడులు, దౌర్జన్యాలు, మరో పక్క ధర బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందలకు గురవుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాని న్ని ఇక సాగనంపాల్సినఅవసం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గ అబివృద్ధి ఈప్రాంత ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు , మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దంతులూరి వెంకటేశ్వరరావ్, సీనియర్ నాయకులు గురజాల వెంకటరమణయ్య , మండల టిడిపి ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మహబూబ్‌బాషా, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, నాయకులు గురజాల వాసునాయుడు, చెన్నుపాటి ప్రసాద్, చావామహేంద్ర, తిరుపతాచారి, రామ్మోహన్, రావులకొల్లు సర్పంచ్ పూసల వెంగపనాయుడు, గణపం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, ఏగినేని శ్రీనివాసులునాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, నూతలపాటి జయలక్ష్మి, యారం కృష్ణయ్య, షేక్ ఖాజావలి, జనసేన నాయకులు ఇమ్రాన్, షరీఫ్, కార్యకర్తలు, నాయకులు , జనసేన నాయులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయండి




**రాపూరు, జనవరి 19, ప్రభాతవార్త** వైఎస్సార్‌సీపీ నాయకులు సమన్వయంతో పని చేసి రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాపూరు మండలంలోని వేపినాపి దగ్గర ఉన్న మాజీ ఏఎంసీ చైర్మన్ పాపకన్ను మధురెడ్డి తోటలో మండలంలోని వైసీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నేదురుమల్లి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే ధ్యేయంగా నాయకులు పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న విభేధాలు పక్కన పెట్టి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పంచాయతీల వారీగా సమావేశం నిర్వహించి ఆయా పంచాయతీల్లో పార్టీ బలాబలాలపై చర్చించారు. ఈ సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకుడు పాప కన్ను మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాప కన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు భారీగా నెల్లూరు ప్రజల భాగస్వామ్యం




**నెల్లూరు కార్పొరేషన్,జనవరి19,ప్రభాతవార్త** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విజయవాడలో జరగనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో నెల్లూరునగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు భాగస్వామ్యం చేస్తూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు,ప్రజలు అంబేద్కర్ అభిమానులను తరలించారు.శుక్రవారం విజయవాడలో జరగనున్న డాక్టర్ బి.ఆర్ అందబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సుమారు 28ఆర్టీసీ బస్సుల్లో నెల్లూరు నుంచి తరలించారు.నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా ఉదయగం బయలుదేరిన వాహనాలకు వివిధ సచివాలయాల కార్యదర్శులు ఇంచార్జ్‌లుగా వ్యవహించారు.తొలుత వాహనాలను నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యులు,వైసీపీ నాయకులు రంగారెడ్డి,నగరపాలక సంస్థ వివిధ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నగర జనసేనలో యువత భారీగా చేరిక




నెల్లూరు,జనవరి19 ప్రభాతవార్త-విద్య నెల్లూరు నగరానికి చెందిన సన్నాయి పవన్,సాజిత్,బలరాం ల ఆధ్వర్యంలో 150మందికి పైగా యువత జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యర్శి గునుకుల కిషోర్ సమక్షంలో నగర జనసేనలో చేరారు. పార్టీలో నూతనంగా చేరిన యువతకు గునుకుల పార్టీ పండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువత మెత్తం తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వెంటనే ఉందని, తమ అధినేత ఆశయాలు నచ్చి అనేకమంది యువత నేడు పార్టీలో చేరటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు అణగారిన వర్గాలను ఆకర్షించేందుకు ఆకాశమంత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే సరిపోదని, వైకాపా అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో అణగారిన వర్గానికి చెందిన వారిపై జరిగిన దాడులు, మారన కాండలను ప్రజలు మర్చిపోలేదన్నారు. అందరికి రాజ్యాధికారం రావాలని తమ అధినేత చేస్తున్న కృషిని కూడా వైకాపా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తు పబ్బం గడుపుకుంటున్నారన్నారు. తమ అధినేత ఏ నిర్ణం తీసుకుంటే దానికి కట్టు బడి ఉంటామని, జనసేన,తెలుగదేశం ల ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకోసం శక్తి వంచన లేకుండా కృసిచేస్తామన్నారు. అలాగే నూతనంగా పార్టీలో చేరిన యువత అదినేత అశయాలను ప్రజల్లోకి ముమ్మరంగా తీసుకువెల్లేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, షాజహాన్, సన్నాయి పవన్,సాజిద్, రోషన్,బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ పాటలకు స్టెప్పులేసి అదరగొట్టిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాటలకు జాతీయ రహదారిపై చిందులు, స్టెప్పులతో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అదరగొట్టారు. తొలిసారిగా ఆయన దళితులను ఉత్తేజపరిచేలా వేసిన డాన్సులు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కావలిలో ఏ నోట విన్నా ప్రతాపన్న డాన్సు భలే వుంది అన్న మాటే వినిపిస్తోంది. శుక్రవారం విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవంను పురస్కరించుకుని కావలి నుంచి ఐదు బస్సులలో దళితుల్ని తీసుకెళ్లారు. ఈ బస్సులకు ఆయన జెండా ఊపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వేసిన అంబేద్కర్ పాటకు ఆయన డాన్సు వేసి అందరిని అబ్బురపరిచారు. ఒక్క సారిగా ఆ ప్రాంతం కేకలు, కేరింతలతో డాన్సుల మయమైంది. ఎమ్మెల్యేను భుజాలపై ఎత్తుకుని ఆనందాల్ని వ్యక్తం చేశారు.

## జగన్ చేసే జిమ్మిక్కులకు దళితులు మోసపోరు



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న జిమ్మిక్కులకు దళితులు మోసపోరని టిడిపి ఎస్సీ సెల్ నేతలు ధ్వజమెత్తారు. కావలి టిడిపి కార్యాలయంలో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టిడిపి ఎస్సీ సెల్ నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, ఎస్సీ సెల్ కావలి నియోజకవర్గ అధ్యక్షులు దావులూరి దేవకుమార్ మాదిగ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్ మాదిగ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆత్మకూరి నాగరాజు, ఎస్సీ సెల్ నాయకులు బాలంకయ్య, ఇనగంటి అనిల్‌బాబు, కిరణ్, మోడేగుంట శ్రీనివాసులు, పోట్లూరి శ్రీనివాసులు, సునీల్, వేణు, తదితరులు పాల్గొని మాట్లాడారు. విజయవాడలో జగన్‌రెడ్డి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టడం మంచిదేనన్నారు. అయితే దళిత, గిరిజన సంక్షేమ పథకాలు రద్దు చేసి 125 అడుగుల కిందకు దళిత, గిరిజనులను తొక్కడం న్యాయమా అంటూ వారు ప్రశ్నించారు. దళిత, గిరిజనుల 27 సంక్షేమ పథకాలు రద్దు చేయడమే కాకుండా 50 వేల కోట్ల రూపాయల ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిన ఘనత ఈ జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ వైసిపి ప్రభుత్వ పాలనలో ఎంతో మంది దళిత, గిరిజనులు హత్యగావింపబడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజనుల మీద అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారన్నారు. ఇంత పెద్ద స్థాయిలో దళిత, గిరిజనులను అణిచివేసి అంబేద్కర్ విగ్రహాన్ని అడ్డంపెట్టుకుని వ్యతిరేకంగా వున్న దళిత, గిరిజన ఓట్లు కొల్లగొట్టాలని మరోసారి జగనన్న ప్రయత్నించడం దళిత, గిరిజనులను మోసం చేయడమేనన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఈసారి దళితులు మోసపోయే అవకాశం లేదన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌కు దళిత, గిరిజనులు గట్టిగానే బుద్ధిచెబుతారని హెచ్చరికలు చేశారు. ప్రతి ఒక్కరి గుండెల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కొలువై వుంటారన్నారు. ముఖ్యమంత్రి దళితులపై కపట ప్రేమను చూపడం ఇప్పటికైనా ఆపాలని హెచ్చరించారు.

## చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోన్ ఫోర్ ఇన్‌చార్జ్ అంబూరు సింధూజ పిలుపునిచ్చారు. కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టిఎనటియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు సారధ్యంలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర సాగుతుందన్నారు. ఈ నెల 26,27 తేదిలలో కావలి నియోజకవర్గంలో ఈ యాత్ర జరుగుతుందన్నారు. కార్మికుల ద్రోహి ఈ సైకో రెడ్డిని ఇకనైనా రోజు వారి కూలీలు, ఆటో కార్మికులు అందరు కలిసి రాష్ట్రం నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల రక్షకుడు చంద్రబాబునాయుడుని గెలిపించుకోవాలని ఆమె కోరారు. ఈ బస్సు యాత్ర 26వ తేదిన కాలనీల్లోని కార్మికులతో చర్చలు జరుగుతాయన్నారు. అనంతరం పల్లెనిద్ర వుంటుందన్నారు. 27వ తేది ఉదయం కావలి పట్టణంలో కార్మికులతో కార్మిక చైతన్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్మికులందరూ తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, నియోజ కవర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులు షేక్ షరీఫ్, పట్టణ అధ్యక్షులు నూకలపాటి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేట దర్గాలో హుండీ లెక్కింపు



**అనుమసముద్రంపేట,జనవరి19,ప్రభాతవార్త** : మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని శ్రీఖాజారహమతుల్లా నాయబేరసూల్ స్వామివారి దర్గాలోని హుండీలను శుక్రవారం రాష్ట్ర హైకోర్ట్ ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డ్ రెవెన్యూ అధికారుల సమక్షంలో లెక్కింపును ప్రారంభించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ దర్గా పాలనా వ్యవహారాలు చేపట్టి 11నెలలు అవుతుందని ఈ11నెలల్లో మొత్తం 14హుండీలు చిన్నవి, పెద్దవి నిండి ఉన్నాయని అందులో ఈరోజు రెండు హుండీలను ఓపెన్ చేసి లెక్కింపును ప్రారంభించామని హుండీలన్నీ పూర్తయ్యేవరకు లెక్కింపు కొనసాగుతుందని దర్గా ఇఒ షేక్ మహ్మద్ హుసేన్ తెలిపారు. లెక్కింపు ద్వారా వచ్చే నగదును పంచనామాలు రాసి దర్గా ఖాతాలో జమచేస్తారన్నారు. లెక్కింపులో స్థానిక తహసిల్దార్ పి.లక్ష్మీనర్సింహం , దర్గా ఇఒ 2 షేక్ షరీఫ్, స్టేట్ సూపర్నెంట్ లు షేక్ ఇబ్రహీం, షేక్ గౌస్ మొహిద్దీన్, నెల్లూరు , లొంగోలు ఇన్స్‌పెక్టర్ ఖుదావన్‌అహ్మద్‌బాషా, ఆర్ఐ రవితేజ, సజ్జాదా నషీన్ ఎస్‌జిఎన్‌హాఫీజ్‌పాషా, సర్పంచ్ జిలానీబాషా, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందానిబాషా, ఎంపిటిసి సభ్యులు బిట్-2 షేక్ ఆఫ్జల్ తదితరులు పాల్గొనగా స్థానిక ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జగన్‌వి నామమాత్రపు హామీలు



**నెల్లూరు జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** జగన్‌వి నామమాత్రపు హామీలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 52వ డివిజన్‌లో ఆనకట్టరోడ్‌లో అబ్దుల్‌అజీజ్ ఇంటింటి ప్రచారం చేసి, బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణని ఎమ్మెల్యేగా రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజను నుండే నేను కార్పొరేటర్‌గా గెలిచి మేయర్ అయ్యానని గుర్తుచేశాడు. చంద్రబాబుని సీఎం చేసుకోవాల్సిన అవసరం ప్రజలకు ఎంతైనా ఉందన్నారు. దఫాలవారీగా మద్యపాన నిషేధం చేపడతానని, భవిష్యత్తులో మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని చూపించి రూ.20వేలకోట్లు అప్పు తీసుకున్న ఘనుడు జగన్ అన్నాడు. జగన్ సతీమణి భారతీరెడ్డి ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తానని ప్రచారం చేసి అధికారం చేపట్టాక కేవలం ఇంట్లో ఉన్న అందరికి బిడ్డలకు ఇవ్వకుండా ఒక్కరికే ఇవ్వడం దారుణమని విమర్శించాడు. టీడీపీ అధికారం చేపట్టాక తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఉన్న అందరి బిడ్డలకి చదువుకి ఆర్థికసాయం అందిస్తామన్నాడు. పేదలకు అన్నంపెట్టే అన్నా క్యాంటీను రద్దు చేసిన మూర్ఖుడు జగన్ అని మండిపడ్డాడు. రాష్ట్ర బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటూ టీడీపీ అధికారంలోకి రావాలన్నాడు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటుహక్కుని వినియోగించుకుని నారాయణని తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని అజీజ్ కోరాడు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, ఇక్బాల్, యశ్రబ్, రియాజ్, వెంకయ్యాయాదవ్, చోటు, పాషామొహిద్దీన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.